సాక్షి
ఖమ్మం

బుధవారం ၊ 3 ၊ సెప్టెంబర్ ၊ 2025



మహానేతకు ఘననివాళి

దివంగత మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, అభిమానులు నివాళులర్పించారు. 9లో



'కాళేశ్వరంపై దుష్ప్రచారం'

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు జిల్లావ్యాప్తంగా నిరసన తెలిపారు. 9లో

గరిష్టం / కనిష్టం
26° / 23°

వాతావరణం

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. మధ్యాహ్నం తర్వాత పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు కురిసే వర్షం అవకాశముంది.

న్యూస్‌రీల్

మహిళా, బాలల రక్షణ సేవలపై అవగాహన

రఘునాథపాలెం: మహిళలు, బాలల రక్షణకు అందుబాటులో ఉన్న సేవలపై అందరూ అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి సూచించారు. సంకల్ప్ పథకంలో భాగంగా మంగళవారం మండలంలోని తెలంగాణ మైనార్టీ, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. అందుబాటులో ఉన్న పథకాలు, హెల్ప్‌లైన్ నంబర్లను వివరించడమే కాక నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ అక్షరాస్యతపై సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వెంకటేశ్వరరావు, జిల్లా మహిళా సాధికార కేంద్రం సమన్వయకర్త ఎస్.డీ.సమ్రీన్‌తోపాటు కె.సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేపపిల్లల టెండర్ల దాఖలు గడువు పొడిగింపు

ఖమ్మంవ్యవసాయం: చేపపిల్లల పంపిణీకి వ్యాపారులు టెండర్లు దాఖలు చేసే గడువును ప్రభుత్వం పొడిగించింది. ఈనెల 1వ తేదీతో గడువు ముగియగా రాష్ట్రవ్యాప్తంగా 25 టెండర్లే దాఖలయ్యాయి. ఇందులో జిల్లాలో మూడు టెండర్లు ఉన్నాయి. దీంతో గడువును ఈనెల 8వ తేదీ వరకు పెంచారు. ఆపై టెండర్లను ఖరారు చేశాక చేప పిల్లల పంపిణీ మొదలయ్యే అవకాశముంది. ఇదిలా ఉండగా గతంలో చేప పిల్లలు పంపిణీ చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాక చాలామంది ఈసారి ఆసక్తి చూపలేదని తెలిసింది. కాగా, జిల్లాలో ఈ ఏడాది 882 జలాశయాల్లో 3.49కోట్ల చేపపిల్లలు ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించారు. జలాశయాలు నిండినందున త్వరగా చేపపిల్లలు అందించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ఏఈలకు డీఈలుగా పదోన్నతి

ఖమ్మంఅర్బన్: జలవనరుల శాఖలో పలువురు అసిస్టెంట్ ఇంజనీర్ల(ఏఈలు)కు డిప్యూటీ ఇంజనీర్లుగా(డీఈలు) పదోన్నతి కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 77మందికి తాత్కాలికంగా పదోన్నతులు కల్పించగా జిల్లా నుంచి ఇద్దరు జాబితాలో ఉన్నారు. ఖమ్మం సీఈ కార్యాలయం శ్రీనివాస్‌ను పదోన్నతి కల్పించి సూర్యాపేట సర్కిల్ ఆఫీస్‌లో డీఈగా, కల్లూరు ఏఈ శివకుమార్‌ను ములుగు జిల్లా గోవిందరావుపేట డీఈగా నియమించారు. అలాగే, పాలేరు-3 విభాగంలో ఖాళీగా ఉన్న డీఈ పోస్టులో నల్లగొండ జిల్లా నకిరేకల్ నుంచి వెంకటరామిరెడ్డి రానున్నారు.

కంటైనర్‌లో కుక్కి కుక్కి తరలింపు



గాయపడిన జీవాలను దించుతున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: శ్రీకాకుళం నుంచి హైదరాబాద్ తరలిస్తున్న మినీ వ్యాన్‌లో తనిఖీ చేయగా 31 గోవులను కుక్కికుక్కి తీసుకెళ్తున్నట్లు బయటపడింది. ఖమ్మం అర్బన్ పోలీసులు మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా వీటిని కబేళాకు తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు గోవులను టేకులపల్లిలోని శ్రీ వెంకటేశ్వర గోశాలకు తరలించారు. అయితే, మార్గమధ్యలో కుదుపులతో గోవులు గాయపడగా కిందకు దించేందుకు శ్రమించాల్సి వచ్చింది. ఇందులో 15ఆవులు, ఎనిమిది దూడలు, ఏడు పెయ్యలు, ఒక ఎద్దు ఉండగా, కబేళా వ్యాపారి ఖాన్‌తోపాటు వ్యాన్ డ్రైవర్, క్లీనర్, కూలీపై కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

సార్... ఇటూ చూడండి

- నత్తనడకన సీతారామ ఎత్తిపోతల పథకం పనులు
- అందుబాటులోకి రాని 100 పడకల ఆస్పత్రులు
- హామీలకే పరిమితమైన యూనివర్సిటీ ఏర్పాటు

నేడు భద్రాద్రి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని వనరులు అందుబాటులో ఉన్నా అభివృద్ధి అంతంత మాత్రంగానే సాగుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పలు పథకాల అమలును వేగవంతం చేసేలా దృష్టి సారించారు. ఇందులో భాగంగా సీతారామ ఎత్తిపోతల పథకం అంచనా వ్యయాన్ని సవరించగా.. ప్రత్యేక శ్రద్ధ చూపితే తప్ప పనులు పూర్తయ్యే అవకాశం కానరావడం లేదు. ఇక ప్రభుత్వ ఆస్పత్రుల నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోకపోగా, బుగ్గపాడులోని ఫుడ్‌పార్క్ అందుబాటులోకి రావడం లేదు. దశాబ్దాలుగా ఖమ్మంలో యూనివర్సిటీ ఏర్పాటు కోసం పోరాడుతున్నా అడుగు ముందుకు పడలేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు నేడు (బుధవారం) వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆయా సమస్యలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా రహదారులు

ఉమ్మడి జిల్లా మీదుగా ఏపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రోడ్లు నానాటికీ అధ్వానంగా మారుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు ఏటా మరమ్మతులు, రోడ్ల నిర్మాణానికి పంపిస్తున్న ప్రతిపాదనలు అమలుకు నోచుకోవడం లేదు. ఇటీవల హ్యామ్ నిధులు వస్తాయని చెప్పినా వీటితో మరమ్మతులే చేపట్టనున్నట్లు తెలుస్తోంది. తల్లాడ - ఖమ్మం, వైరా మండలం స్టేజీ పినపాక నుంచి ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా నెమలికి వెళ్లే ప్రధాన రహదారి, పల్లిపాడు-ఏన్కూరు రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయి. ఏటా వర్షాకాలంలో వరదతో మరింత దెబ్బతింటున్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు.

కంపెనీల జాడేది?



బుగ్గపాడులోని మెగా ఫుడ్‌పార్క్ ముఖద్వారం

తల్లాడ మండలం బుగ్గపాడులో 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. ఆయన మృతితో ఫుడ్‌పార్క్ మూలనపడింది. 2017లో అప్పటి మంత్రులు కేటీఆర్, తుమ్మల దృష్టి సారించగా.. ప్రస్తుత కాంగ్రెస్ హయాంలోనూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఫుడ్ పార్క్‌ను సందర్శించారు. 2018లో రెండు కంపెనీలు వచ్చినా వెనక్కు వెళ్లాయి. భూమి ధర ఎక్కువగా ఉండటంతోనే పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఫలితంగా ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగాయి.

నెరవేరని యూనివర్సిటీ కల



ఖమ్మంలో యూనివర్సిటీ ఏర్పాటు కల నెరవేరడం లేదు. విద్యార్థి సంఘాలు గత కొన్నేళ్లుగా ఖమ్మంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఆందోళనలు చేస్తున్నాయి. గతంలో పలు ప్రభుత్వాలకు వినతిపత్రాలు అందించడంతోపాటు ఆందోళనలు నిర్వహించాయి. అయినా ఫలితం లేకుండాపోయింది. ఖమ్మంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో వేలాదిమంది విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీకి లేదా హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లాల్సి వస్తోంది. దీంతో అనేకమంది ప్రతిభ ఉన్న పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించలేకపోతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ఖమ్మంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సీతారామ పనుల్లో జాప్యం

ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసేలా తలపెట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత ఏడాది ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీతారామ పంపు హౌస్‌లో మోటార్లు స్విచాన్ చేశారు. ఈ వానాకాలం ఆరంభంలో గోదావరి నీటిని ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌లోకి వదిలారు. ఇవి తప్ప సీతారామ ప్రాజెక్టు పనులు ముందుకు సాగడం లేదు. సత్తుపల్లి ట్రంక్, పాలేరు లింక్ కాల్వ పనులు ఇంకా చేయాల్సి ఉంది. ప్రాజెక్టులో 8 డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ పనులకు టెండర్లు ఆహ్వానించినా భూసేకరణ పూర్తికాలేదు. ప్యాకేజీ-9లోని యాతాలకుంట టన్నెల్, ప్యాకేజీ -13లో 213 ఎకరాల భూసేకరణ జరగకపోగా, ప్యాకేజీ-14లో 90 శాతం భూసేకరణ పూర్తయినా పనులు 15శాతం వద్దే ఉన్నాయి ప్యాకేజీ-15లో 80 శాతం, ప్యాకేజీ-16లో సగం పనులే పూర్తయ్యాయి. ఇటీవల అంచనా వ్యయాన్ని రూ.13,058 కోట్ల నుంచి రూ.19,325 కోట్లకు సవరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో 3.29 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుతోపాటు 3.45 లక్షల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది.



తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం వద్ద నిలిచిన సీతారామ టన్నెల్ పనులు

ఈ ఆస్పత్రుల ప్రారంభమెప్పుడు?

జిల్లాలో పలు వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేశారు. ఇందులో భాగంగా మధిర, సత్తుపల్లిలో 100 పడకలు, పెనుబల్లిలో 50 పడకలు, కల్లూరులో 30 పడకల ఆస్పత్రుల నిర్మాణం పూర్తయింది. వైరాలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం జరుగుతోంది. పూర్తయిన ఆస్పత్రులైనా ప్రారంభిస్తే పేదలకు మెరుగైన వైద్యం అందనుంది.



సత్తుపల్లిలో నిర్మాణం పూర్తయిన 100 పడకల ఆస్పత్రి

నిమజ్జన ఘాట్‌లో ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లపై చర్చిస్తున్న సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ తదితరులు

ఖమ్మంక్రైం: ఖమ్మంలో కాల్వొడ్డు వద్ద మున్నేటిలో వినాయక నిమజ్జనానికి ఘాట్ ఏర్పాటుచేశారు. ఇక్కడ ఏర్పాట్లను మంగళవారం పోలీసు కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, మేయర్ పి.నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. శోభాయాత్ర, నిమజ్జనానికి ఇబ్బంది రాకుండా అడ్డుగా వైర్లు, చెట్లకొమ్మల తొలగింపు, క్రేన్లు, ఫ్లడ్‌లైట్లు, బారికేడ్ల ఏర్పాటు, రాకపోకలకు వేర్వేరు మార్గాల ఏర్పాటుపై చర్చించారు. నిమజ్జనం ప్రశాంతంగా సాగేలా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏసీపీ రమణమూర్తి, సీఐలు మోహన్‌బాబు, సత్యనారాయణ, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, అడిషినల్ కమిషనర్ అనిల్, డీఈఈ శ్రీనివాస్‌రావు, ఉత్సవ కమిటీ బాధ్యులు వినోద్ లాహోటి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి..

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే వైద్యులు, సిబ్బంది లక్ష్యంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి తెలిపారు. రఘునాథపాలెం మండలం మంచుకొండలోని పీహెచ్‌సీని మంగళవారం తనిఖీ చేసిన ఆమె సౌకర్యాలను పరిశీలించి సూచనలు చేశారు. అలాగే, ఖమ్మం 6వ డివిజన్‌లోని ఖానాపురంలో యూపీహెచ్‌సీ భవన నిర్మాణ పనులను డీఎంహెచ్‌ఓ పరిశీలించి సూచనలు చేశారు. ప్రోగ్రాం ఆఫీసర్ బిందుశ్రీ, డీపీఓ మేకల దుర్గ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి 'జన్ భగీధరి అభియాన్'

ఏన్కూరు: గిరిజన సంక్షేమానికి కేంద్రప్రభుత్వం జన్ భగీధరి అభియాన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయలక్ష్మి తెలిపారు. ఏన్కూరులో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమావేశమైన ఆమె మాట్లాడారు. గిరిజన గ్రామాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఏన్కూరు కళాశాల హాస్టల్‌కు కేటాయించిన భవనాన్ని డీడీ పరిశీలించారు. ఎంపీడీఓ రంజిత్‌కుమార్, ఏఓ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో ప్రయోజనం

తల్లాడ: సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుచేసుకుంటే ఏళ్ల తరబడి ప్రయోజనాలు ఉంటాయని అధికారులు తెలిపారు. తల్లాడ, అన్నారుగూడెంలో మంగళవారం మోడల్ సోలార్ విలేజ్ స్కీంపై నిర్వహించిన సదస్సుల్లో డీపీఓ ఆశాలత, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ శ్రీనివాసాచారి, రెడ్‌కో జిల్లా మేనేజర్ అజయ్‌కుమార్ మాట్లాడారు. ప్లాంట్ ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం రూ.78 వేల సబ్సిడీ ఇస్తుందని, మిగతా వ్యయంపై బ్యాంక్ రుణం తీసుకోవచ్చని తెలిపారు. ప్లాంట్ ద్వారా ఇంటికి కావాల్సిన విద్యుత్ ఉత్పత్తి చేసుకుంటూనే అదనపు విద్యుత్‌ను శాఖకు ఇవ్వొచ్చని చెప్పారు. ఎంపీడీఓ సురేష్, ఏడీఈ సతీష్, ఏఈ ప్రసాద్, ఆపతి వెంకటరామారావు పాల్గొన్నారు.

పల్లె ఓటర్లు.. 8,02,691 మంది

- గ్రామపంచాయతీల వారీగా ఓటర్ల తుది జాబితా విడుదల
- ఓటర్లలో మహిళలే అధికం
- జిల్లాలో 5,214 పోలింగ్ స్టేషన్లు

ఖమ్మంసహకారనగర్: గ్రామపంచాయతీ ఓటర్ల తుది జాబితా విడుదలైంది. జిల్లాలోని 20మండలాల్లో 571 గ్రామపంచాయతీలకు గాను 8,02,691 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. ఇందులో పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లు 26,181 మంది ఎక్కువగా ఉండడం విశేషం.

పెరిగిన ఒక ఓటు

గతనెల 28న జీపీల్లో వార్డుల వారీగా ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేశారు. ఈ జాబితాలో 8,02,690 మంది ఓటర్లు ఉండగా.. 29న జిల్లా, 30న మండల స్థాయిలో పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించారు. అలాగే, గత 28 నుంచి 30వరకు అభ్యంతరాలు స్వీకరించారు. వీటిని పరిశీలించిన అనంతరం మంగళవారం ఓటర్ల తుది జాబితా విడుదల చేయగా ముసాయిదాతో పోలిస్తే కామేపల్లి మండలం ఒక ఓటరు పెరిగి ఓటర్ల సంఖ్య 8,02,691గా తేలింది. కాగా, 2,307 అభ్యంతరాలను పరిష్కరించామని అధికారులు తెలిపారు.

అత్యధికంగా 'పాలెం'లో..

జిల్లాలోని తిరుమలాయపాలెం మండలంలో అత్యధికంగా ఓటర్లు ఉన్నారు. ఈ మండలంలో 50,771 మంది, కూసుమంచిలో 50,149 మంది, నేలకొండపల్లిలో 49,533 మంది ఉన్నట్లు తేలింది. తక్కువగా వైరా మండలంలో 27,306 మందే ఉన్నారు. ఇక మొత్తం 5,214 పోలింగ్ స్టేషన్లను గుర్తించగా కూసుమంచిలో అత్యధికంగా 364 స్టేషన్లు ఏర్పాటుచేయనున్నారు. కారేపల్లి, తిరుమలాయపాలెం మండలంలో 356చొప్పున ఉన్నాయి. తక్కువగా వైరా మండలంలో 200 పీఎస్‌లు ఏర్పాటుకానున్నాయి.



రఘునాథపాలెం మండలం రేగులచెలక జీపీలో ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న కార్యదర్శి

జీపీ ఓటర్ల జాబితా వివరాలు

మండలాలు	20
గ్రామపంచాయతీలు	571
మొత్తం ఓటర్లు	8,02,691
మహిళలు	4,14,425
పురుషులు	3,88,244
ఇతరులు	22
పోలింగ్ స్టేషన్లు	5,214

తక్కువ ధరకే రాజీవ్ స్వగృహ ఫ్లాట్లు

రాష్ట్ర హౌసింగ్ పీడీ వీ.పీ.గౌతమ్

ఖమ్మంరూరల్: ఖమ్మం నగర సమీపాన రాజీవ్ స్వగృహలోని ఫ్లాట్లను తక్కువ ధరకే విక్రయించనున్నందున ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండీ వీపీ.గౌతమ్ సూచించారు. ఖమ్మం రూరల్ మండలంలోని రాజీవ్ స్వగృహ సముదాయాన్ని మంగళవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. చదరపు అడుగు ధర రూ.1,150 నిర్ణయించగా, 576 ఫ్లాట్లు ఉన్నాయని తెలిపారు. మున్నేటి పక్కన రిటైనింగ్ వాల్ నిర్మిస్తుండడం, సముదాయం బఫర్‌జోన్ పరిధిలోకి రానందున అనుమానం లేకుండా కొనుగోలు చేయవచ్చని చెప్పారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 9వ తేదీన ఫ్లాట్లు కేటాయిస్తామని గౌతమ్ తెలిపారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

కూసుమంచి: ఇందిరమ్మ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగంగా చేపట్టాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండీ గౌతమ్ సూచించారు. కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెం, ఖమ్మంరూరల్ మండలం ఆరెంపులల్లో నిర్మాణాలను పరిశీలించిన ఆయన ఇటుక, ఇసుక, కంకర నాణ్యతపై ఆరా తీసి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇసుక ఉచితంగా సరఫరా చేస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్, ఎంపీడీఓలు రాంచందర్‌రావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



ఇటుకల నాణ్యతను పరిశీలిస్తున్న ఎండీ గౌతమ్

పంట నష్టంపై సర్వే ప్రారంభం

ఖమ్మంవ్యవసాయం: అధిక వర్షాలతో జిల్లాలో పంటలకు జరిగిన నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం నుంచి సర్వే మొదలుపెట్టారు. క్లస్టర్ల వారీగా ఏఈఓలు సర్వే చేస్తుండగా, 33 శాతం మేర జరిగిన పంట నష్టాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు. నష్టం జరిగిన పొలంలో రైతు ఫొటో తీసి అప్‌లోడ్ చేయనున్నారు. ప్రాథమికంగా జిల్లాలో 6,559 మంది రైతులకు చెందిన 9,282 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు గుర్తించారు. సర్వే అనంతరం ఈ విషయంలో స్పష్టత రానుంది.

అన్నదాతల అరిగోస..

రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదు. వ్యవసాయ పనులను వదులుకుని పొద్దంతా పీఏసీఎస్‌ల వద్ద బారులు దీరినా ఒక బస్తా లభించడం గగనమవుతోంది. జిల్లాలోని పలు పీఏసీఎస్‌ల వద్ద మంగళవారం ఇదే పరిస్థితి నెలకొనగా కొన్నిచోట్ల రైతులు ఆందోళనకు దిగారు.

- యూరియా కోసం బారులు
- అయినా లభ్యత లేక ఆందోళన

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ, రఘునాథపాలెం, వీ.వీ.పాలెం పీఏసీఎస్‌లకు యూరియా వచ్చిందనే సమాచారంతో రైతులు ఉదయమే బారులు దీరారు. దీంతో పాస్‌బుక్కులు, ఆధార్ కార్డుల జిరాక్స్ తీసుకుని కూపన్లు పంపిణీ చేసిన అధికారులు యూరియా బస్తాలు అందజేశారు. సీఐ ఉస్మాన్ షరీఫ్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేయగా సీఈఓలు శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వర్లు, తిరుపతిరావు పాల్గొన్నారు.

వేంసూరు/తల్లాడ/కల్లూరు రూరల్: వేంసూరు మండలం కే.జీ.మల్లెల సొసైటీకి 15 రోజుల తరువాత 890 బస్తాల యూరియా రావడంతో 10 గ్రామాల రైతులు పోటీ పడ్డారు. దీంతో సాయంత్రం వరకు కూపన్లు పంపిణీ చేసి ఒక్కో బస్తా యూరియా అందజేశారు. తల్లాడ పీఏసీఎస్‌కు మంగళవారం తెల్లవారేసరికి వందలాది మంది రైతులు చేరుకోగా.. 8గంటలకు యూరియా లారీ వచ్చింది. కానీ 445 బస్తాల యూరియా వస్తే.. 1,200 మంది రైతులు ఉండడంతో ఏఓ ఎండీ.తాజుద్దీన్, ఎస్‌ఐ ఎస్.వెంకటకృష్ణ, సొసైటీ సీఈఓ నాగబాబు వారిని నచ్చచెప్పి 1,150 కూపన్లు పంపిణీ చేయగా మిగతా వారికి తర్వాత ఇస్తామని తెలిపారు. కల్లూరు మండలంలోని చెన్నూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘానికి 330 బస్తాలు రాగా 700 మంది రైతులు ఉండడంతో సిబ్బంది గోదాంకు తాళం వేశారు. మరో 30 టన్నుల యూరియా వచ్చాకే పంపిణీ చేస్తామని చెప్పడంతో రైతులు ఆందోళనకు దిగగా ఏఓ ఎం.రూప, పోలీసులు నచ్చచెప్పారు.

కొణిజర్ల/ఏన్కూరు: యూరియా లభ్యత లేక రైతులు కొణిజర్లలో రాస్తారోకోకు దిగారు. గోపవరం పీఏసీఎస్‌కు 300 బస్తాల యూరియా రావడంతో రైతులకు రెండేసి కూపన్లు ఇచ్చారు. ఇంకొందరు రైతులు రాగా కూపన్లు లేవని చెప్పగా నిరసన తెలిపారు. దీంతో పోలీసులు, ఏఓ బాలాజీ నచ్చచెప్పగా ఆందోళన విరమించినా యూరియా దిగుమతి చేయకుండా అడ్డుకున్నారు. ఈక్రమాన అందరికీ ఒక్కో బస్తా ఇస్తామని చెప్పగా ఆందోళన విరమించారు. ఇక ఏన్కూరు పీఏసీఎస్ వద్ద పోలీసుల సహకారంతో యూరియా పంపిణీ చేశారు.

ముదిగొండ/బోనకల్: ముదిగొండ మండలం మేడేపల్లి సొసైటీలో మంగళవారం 200 బస్తాల యూరియా వస్తే 800మంది రైతులు పోటీపడ్డారు. దీంతో వ్యవసాయ అధికారులు, పోలీసులు మరో 10మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని నచ్చజెప్పారు. అనంతరం ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున యూరియా సరఫరా చేసినట్లు ఏఓ సరిత తెలిపారు. అలాగే, బోనకల్ మండలంలోని రావినూతల, బ్రాహ్మణపల్లి, కలకోట, పెద్దబీరవల్లి సొసైటీలకు మంగళవారం 10టన్నుల చొప్పున యూరియా వస్తే పెద్దసంఖ్యలో రైతులు పోటీపడ్డారు. బ్రాహ్మణపల్లి సొసైటీలో రాపల్లి రైతులు కూడా సభ్యులు కావడంతో బ్రాహ్మణపల్లి రైతులకే ఇవ్వడంపై అభ్యంతరం తెలిపారు. పీఏసీఎస్‌ల్లో యూరియా పంపిణీని మధిర ఏడీఏ స్వర్ణ విజయ చంద్ర, ఏఓ వినయ్‌కుమార్ పరిశీలించారు.



రఘునాథపాలెం : వీ.వీ.పాలెం సొసైటీ వద్ద బారులుదీరిన అన్నదాతలు



కొణిజర్ల : ఆందోళనకు దిగిన రైతులకు నచ్చజెబుతున్న ఏఓ బాలాజీ



కల్లూరు రూరల్ : చెన్నూరు సొసైటీ ఎదుట యూరియా కోసం రైతుల పాట్లు



ఏన్కూరు : యూరియా పంపిణీని పర్యవేక్షిస్తున్న పోలీసులు


స్వాగతం... సుస్వాగతం...
ఇందిరమ్మ ఇంటితో ...
నిరుపేదల ముఖంలో చిరునవ్వు వచ్చే...
భద్రాద్రి రాముని సాక్షిగా...
ఇచ్చిన మాటను నిజం చేస్తూ...
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బెండాలపాడు గ్రామాన్ని
పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని ఒక్క పూరి గుడిసె
కూడా లేకుండా ఇందిరమ్మ ఇళ్ళను అందరికి
మంజూరు చేసి, నేడు గృహ ప్రవేశము
చేయుటకు విచ్చేయుచున్న
గౌ॥ ముఖ్యమంత్రివర్యులు
శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి
గౌ॥ ఉప ముఖ్యమంత్రివర్యులు
శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారికి
గౌ॥ రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖామాత్యులు
శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారికి
గౌ॥ వ్యవసాయ శాఖామాత్యులు
శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారికి
మరియు ఇతర నాయకులకు ఇవే మా
స్వాగత సుమాంజలులు....
గౌ॥ శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
గౌ॥ శ్రీ భట్టి విక్రమార్క మల్లు గారు
తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,
ఆర్థిక మరియు విద్యుత్ శాఖామాత్యులు
యరమల
పూర్ణచంద్రారెడ్డి (KPR)
భీమవరం గ్రా॥, ఎర్రుపాలెం మం॥,
ఖమ్మం జిల్లా.